క్లుప్తంగా

బ్రాహ్మణ యువత ఉపాధికి బాటలు



కామేష్ దంపతులను సత్కరిస్తున్న సంఘ నాయకులు

సీటీఆర్ఐ: రాష్ట్రంలో బ్రాహ్మణ యువతకు విద్య, ఉపాధి రంగాల్లో బాటలు వేస్తామని రాష్ట్ర బ్రాహ్మణ యువజన సమాఖ్య అధ్యక్షుడు, న్యాయవాది సూరంపూడి కామేష్ అన్నారు. బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాసులను రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామేష్ దంపతులను దుశ్శాలువతో జిల్లా బ్రాహ్మణ నగర ప్రతినిధులు సత్కరించారు. కామేష్ మాట్లాడుతూ బ్రాహ్మణ యువత మేధావులుగా తయారు చేసే అన్ని కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామన్నారు. సాంకేతిక పద్ధతులు ద్వారా విద్య, ఉపాధి అవకాశాలను వారికి అందజేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి కలగా సుబ్రహ్మణ్యం, నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, నగర యువజన కార్యదర్శి గుడిపూడిం సునీల్ గౌతమ్ పాల్గొన్నారు.

పంచాంగాల పంపిణీ

కడియం: మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గ్రంధి నాగేశ్వరరావు (నాగబాబు) ఆధ్వర్యంలో స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం విశ్వావసు నామ సంవత్సర పంచాంగాలను పంపిణీ చేశారు. ఉమ్మడి జిల్లా సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబీ సమకూర్చిన వీటిని గ్రామ సంఘాల అధ్యక్షులకు అందజేస్తున్నట్లు నాగబాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రముఖులు వారణాశి శ్రీనివాసగుప్తా, తమ్మన సత్తిబాబు, కాకి దుర్గాప్రసాద్, కంచర్ల మూర్తి, గ్రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం డివిజన్‌లోని ధవళేశ్వరం సెక్షన్ పరిధిలో గల పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ శంభూనగర్, షిరిడీసాయి నగర్, ఉప్పర కాలనీ, ఆంధ్రా బ్యాంక్ కాలనీ, ధవళేశ్వరం మెయిన్ రోడ్డు ఏరియా పరిధిలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే నగరంలోని సువిశేషపురం, మల్లికార్జున నగర్, సుబ్బారావుపేట, టీటీడీ రోడ్డు ఏరియా, ఎస్‌కేవీటీ స్కూల్ వీధిలో విద్యుత్ ఉండదన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కంబాలచెరువు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న లలితానగర్‌కు చెందిన దేవాబత్తుల నాగమహేష్‌పై కేసు నమోదైంది. మూడో పట్టణ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. పాస్టర్ ప్రవీణ్ కుమార్‌ది రోడ్డు ప్రమాదం కాదని, అది హత్యేనని నాగ మహేష్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దీంతో అతడిపై పోలీసులు కేసు నమోదు చేసి న్యాయమూర్తి ముందు హాజరు పర్చారు. నాగమహేష్‌పై తదుపరి విచారణకు ఆదేశించారు. పూర్తి విషయం తెలియకుండా తప్పుడు వార్తలను ప్రచారం చేసినా, ఫేక్ వీడియోలను పెట్టినా, మతపరమైన గొడవలకు ఆస్కారం ఉన్న పోస్టులు సామాజిక మాధ్యమాలలో పోస్టు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని త్రీటౌన్ సీఐ వి.అప్పారావు తెలిపారు.

ప్రయాణమెలా..

- మోరంపూడి ఫ్లైఓవర్‌పై ప్రయాణికుల అవస్థలు
- కనిపించని విద్యుద్దీపాలు
- రాత్రి వేళలో టెన్షన్
- అధ్వానంగా సర్వీసు రోడ్లు

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లో ఫ్లైఓవర్‌ను కూటమి ప్రభుత్వం ప్రారంభించి ఐదు నెలలు కావొస్తోంది. కానీ అక్కడ ఇంకా సమస్యలు తాండవిస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒక పక్క విద్యుద్దీపాలు వేయకపోవడంతో రాత్రి సమయంలో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. అలాగే సర్వీసు రోడ్లు లేకపోవడంతో రాకపోకలు ఇబ్బంది కలుగుతోంది.

వివరాలు ఇవీ..

మోరంపూడి జంక్షన్‌లో ప్రమాదాల నివారణకు గత టీడీపీ ప్రభుత్వంలో ఫ్లైఓవర్ మంజూరై శంకుస్థాపన జరిగి మళ్లీ నిలిచిపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ఎంపీ మార్గాని భరత్ రామ్ కేంద్ర ప్రభుత్వానికి మోరంపూడి ఫ్లైఓవర్ ఆవశ్యకతను తెలియజేశారు. రూ.60 కోట్లతో 1.42 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ మంజూరు చేయించి శంకుస్థాపన చేయించారు. నిర్మాణ పనులు ప్రారంభించినప్పటి నుంచి ఆయన ప్రతి వారం పనులను పర్యవేక్షిస్తూ వేగవంతంగా నిర్మాణం జరిగేలా కృషి చేశారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులు 90 శాతం పనులు ఆయన హయాంలోనే పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు హడావుడిగా ప్రారంభించేశారు.



మోరంపూడి ఫ్లైఓవర్‌పై కనిపించని విద్యుద్దీపాలు

కానరాని దీపాలు

ఫ్లైఓవర్ ను ప్రారంభించినప్పటికీ విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనచోదకులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల దీనిపై బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. కేవలం విద్యుత్ దీపాల క్లాంప్‌లు మాత్రమే బిగించారు తప్ప దీపాలు ఏర్పాటు చేయలేదు.

సర్వీసు రోడ్లు వేసేది ఎప్పుడో..

ఫ్లైఓవర్ కింద ఉన్న సర్వీసు రోడ్లు భారీ గోతులతో దర్శనమిస్తున్నాయి. రోజూ వందల వాహనాలు ఈ రోడ్ల మీదుగా ప్రయాణిస్తుంటాయి. గుంటల్లో వాహనాలు పడినప్పుడు ఒంటిలో ఎముకలు కదిలిపోతున్నాయని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి రాగానే హడావుడి చేసిన సిటీ ఎమ్మెల్యే మరలా ఫ్లైఓవర్ పనులు విషయాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవు.



సర్వీసు రోడ్డుపై భారీ గోతులు



గోతులమయంగా ఉన్న సర్వీసు రోడ్డు

సర్వీసు రోడ్లు వేయాలి



ఫ్లైఓవర్‌కు సర్వీసు రోడ్లు, వీధి దీపాలు లేకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతమున్న రోడ్లు గోతులమయంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన సర్వీసురోడ్లు, విద్యుద్దీపాలు వేయించాలి.

– చీరా రాజు, మోరంపూడి జంక్షన్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కంబాలచెరువు: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించాయి. స్థానిక ఆనం రోటరీ హాలులో సోమవారం ఈ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, ఫ్యాప్టో రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవ్వూరి రవి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పల్లా రాజారావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డేనియల్ బాబు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగరాజు, మున్సిపల్ టీచర్స్ జిల్లా అధ్యక్షుడు కెనడీ బాబు, తెలుగు నాడు టీచర్స్ సంఘం రాష్ట్ర నాయకులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షేమంగా ఇంటికి చేరిన బాలిక



పాపను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై క్రాంతికుమార్

- ఫిర్యాదు వచ్చిన రెండు గంటల్లోనే ఛేదించిన ధవళేశ్వరం పోలీసులు
- ఎస్పీ అభినందనలు

ధవళేశ్వరం: ఇంటి నుంచి అదృశ్యమైన బాలికను పోలీసులు క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఫిర్యాదు వచ్చిన రెండు గంటల్లో బాలికను కనిపెట్టారు. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరంలోని వాడపేటకు చెందిన 9 ఏళ్ల శ్రీదుర్గ సోమవారం ఉదయం ఇంటి నుంచి మాయమైంది. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల అన్ని చోట్లా గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లిదండ్రులు మధ్యాహ్నం 3 గంటలకు ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిషోర్, సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని నాలుగు బృందాలుగా ఏర్పాటు చేసి గాలించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సీసీ కెమెరాల సాయంతో ఆ బాలిక శ్యామలా సెంటర్‌లో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని బాలికను ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును త్వరితగతిన ఛేదించిన సీఐ టి.గణేష్, ఎస్సై క్రాంతి కుమార్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కిమ్స్ యాజమాన్యానిదే బాధ్యత



నాగాంజలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఫార్మాసిస్టు నాగాంజలికి ఏం జరిగినా ఆసుపత్రి యాజమాన్యమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కాంగ్రెస్ నాయకులు ఆసుపత్రికి వెళ్లి నాగాంజలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆమెను లైంగికంగా వేధించిన దీపక్‌పై కఠిన చట్టాలు పెట్టకుండా పోలీసులు నిర్లక్ష్యంగా కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఆ కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.అలాగే పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై కూడా ప్రభుత్వం ఇలాగే డ్రామాలు నడిపిస్తోందన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేటలో క్రైస్తవుల శాంతి ర్యాలీ



హుకుంపేటలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

రాజమహేంద్రవరం రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా హుకుంపేటలో శనివారం రాత్రి శాంతియుతంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. నక్కా విజయకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రూపాంతర లూథరన్ దేవాలయం, యునైటెడ్ క్రిస్టియన్ ఫెలోషిప్ పాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. ప్రవీణ్ మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, ఆయన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో సంఘకాపరులు శామ్యూల్ సందీప్(రూపాంతర లూథరన్ దేవాలయం), రత్నం (స్వస్థత ప్రార్థనా మందిరం), వెలుగమ్మ (జీసస్ ప్రేయర్ టవర్), డానియల్ రాజు (బెతెస్థ ప్రార్థన మందిరం), సాల్మన్‌రాజ్ (నూతన జెరూషలేము దేవాలయం), రమేష్ కుమార్ (జీసస్ ప్రేయర్ హౌస్), వెన్నపు రవికుమార్ (గుడ్ సమెరిటన్ ఆర్మీ వ్యవస్థాపకుడు), బ్రదర్ మోహన్ (ఆర్‌సీఎం చర్చి), బ్రదర్ సతీష్ (ట్రూలైట్ మినిస్ట్రీస్), దళిత సంఘ నాయకులు లాజరు, సుందరపల్లి అనిల్ పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారాలు అందుకున్న పండితులు

కోరుకొండ: గ్రామంలోని హరేరామ సమాజం కల్యాణ మండపంలో భార్గవ గాయత్రీ బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు పరస శ్రీను ఆధ్వర్యంలో సోమవారం ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా 8 మంది పండితులను ఘనంగా సత్కరించారు. కపిలివాయి నమశ్శివాయ శర్మ పంచాంగ పఠనం చేశారు. మార్గాపుర నరసింహాచార్యులు మాట్లాడుతూ విశ్వావసు నామసంవత్సర విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు డాక్టర్ పెద్దింటి విద్యాసాగర్, పండితులు జోస్యుల భగవాన్ శర్మ, ముత్యరాజు, కొక్కిరిగడ్డ దుర్గాప్రసాద్, కర్రి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు సన్మానం



ట్రాన్స్‌జెండర్ మందాకినిని సన్మానిస్తున్న సభ్యులు

ధవళేశ్వరం: అన్ని రంగాల్లో ట్రాన్స్‌జెండర్లు రాణిస్తున్నారని ట్రాన్స్‌జెండర్స్ సంఘ నాయకురాలు మందాకిని అన్నారు. చేంజెస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ధవళేశ్వరంలో ప్రపంచ ట్రాన్స్‌జెండర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు మందానికి, రాజేశ్వరిలను సన్మానించారు. మందాకిని మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లను గౌరవించాలని, వారికి చట్టపరమైన హక్కులను కల్పించాలని కోరారు.

మార్మోగిన సత్యసాయిబాబా నామస్మరణ



కోటపాడులో సత్యసాయిబాబా చిత్రపటం వద్ద భజనలు చేస్తున్న భక్తులు

రంగంపేట: సత్యసాయి నామస్మరణతో కోటపాడు గ్రామం మార్మోగింది. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆ గ్రామంలో బాబా చిత్రపటం ముందు రెండు గంటల పాటు 50 ఇళ్లలో భజనలు చేసినట్టు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్, నిర్వాహకుడు కందర్ప రాంబాబు మాస్టారు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో 100 ఇళ్లలో ఒక్కొక్క ఇంటిలో గంట చొప్పున 100 గంటల భజన కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో రంగంపేట సబ్‌జోన్ కన్వీనర్ మల్రెడ్డి వీర్రాజు, జిల్లా వేదాధ్యయన సమన్వయ కర్త కందర్ప శ్రీరామశర్మ, విద్యా విభాగ సమన్వయ కర్త ఎల్.శ్రీనివాసరాజు, ఈలకొలను సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు, సబ్‌జోన్ ఆధ్యాత్మిక సమన్వయకర్త టి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా శివకుమార్



ప్రమాణ స్వీకారం చేస్తున్న శివకుమార్

సీతానగరం: రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘానికి మొదటి ప్రధాన కార్యదర్శిగా వంగలపూడికి చెందిన డాక్టర్ సూరెడ్డి శివకుమార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో రాష్ట్ర అడహక్ కమిటీ కన్వీనర్ కె.గోవిందరావు సూచనల మేరకు సంఘం గౌరవాధ్యక్షుడు అన్నె రామారావు సమక్షంలో మాజీ సైనికుల రాష్ట్ర కమిటీని ఎంపిక చేశారు. వంగలపూడికి చెందిన నేవీ మాజీ సైనికుడు డాక్టర్ సూరెడ్డి శివకుమార్ సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.

సినిమాలు



శ్యామల	:	రాబిన్‌హుడ్
సూర్యమినీ	:	ఎల్2ఎంపురాన్
సూర్యప్యాలెస్	:	మ్యాడ్ స్క్వేర్
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	రాబిన్‌హుడ్
అనుశ్రీ	:	వీరధీరశూర
రాజా	:	రాబిన్‌హుడ్
ఊర్వశి	:	ఎల్2ఎంపురాన్
మేనక	:	దిల్‌రూబా
రంభ	:	కోర్ట్
కుమారి	:	మ్యాడ్ స్క్వేర్
అప్సర	:	మ్యాడ్ స్క్వేర్
అశోక	:	మ్యాడ్ స్క్వేర్
నామవరం		
వీఎస్ మహల్	:	రాబిన్‌హుడ్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మ్యాడ్ స్క్వేర్
కడియం		
వెంకటసూర్య	:	మ్యాడ్ స్క్వేర్

రంజాన్ వేడుకలు

రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండగ విశిష్టతను మత గురువులు వివరించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. సంప్రదాయ దుస్తులను ధరించి చిన్నారులు సందడి చేశారు.

– సీటీఆర్ఐ



రాజమహేంద్రవరం నెహ్రూనగర్ ఈద్గాలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



మాజీ ఎంపీ భరత్‌రామ్‌ను సత్కరిస్తున్న ముస్లింలు



సంప్రదాయ దుస్తుల్లో ముస్లింలు







సుబ్రహ్మణ్యం మైదానంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు